ప్రమాదకరంగా పంచాయతీ భవనం



శంషాబాద్ రూరల్: మండలంలోని జూకల్ పంచాయతీ కార్యాలయం భవనం గోడలు బీటలు పారి ప్రమాదకరంగా మారాయి. పురాతన భవనంలో కార్యాలయం కొనసాగుతుండగా.. వెనుక వైపు గోడ బీటలు పారింది. ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. మరమ్మతుల కోసం చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

'కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి'

మైలార్‌దేవ్‌పల్లి: కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం చేపడుతున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు కార్మికులంతా ఉద్యమించాలని ఐఎన్‌టీయూసీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ధనుంజయ్, సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం.చంద్రమోహన్ అన్నారు. కాటేదాన్‌లోని సీఐటీయూ కార్యాలయంలో ఈ నెల 20న దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయాలని కోరుతూ ఆల్ ట్రేడ్ యూనియన్‌ల ఆధ్వర్యంలో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా ఉపాధ్యక్షులు జాజాల రుద్రకుమార్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జి.ఎం.కురుమయ్య, నేతలు ఎన్.జంగయ్య, శంకర్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా నీటి సరఫరా

బీఆర్‌ఎస్ మణికొండ అధ్యక్షుడు సీతారాం

మణికొండ: నిర్ణీత వేళల్లోనే నల్లాల ద్వారా తాగు నీటి సరఫరా చేయాల్సిన లైన్‌మెన్‌లు ఇష్టారాజ్యంగా సరఫరా చేస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని బీఆర్‌ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు డి.సీతారాం ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం పార్టీ నాయకులతో గుడ్ మార్నింగ్ మణికొండ కార్యక్రమంలో భాగంగా అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డునెంబర్ 1లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు నీటి సరఫరా సక్రమంగా జరగటం లేదని, ఒక వైపు రెండు గంటలు, మరో వైపు అరగంట మాత్రమే సరఫరా చేస్తున్నారని ప్రజలు ఆరోపించారని సీతారాం పేర్కొన్నారు. అలకాపూర్ టౌన్‌షిప్‌లోని స్పోర్ట్స్ పార్క్‌లో నీటి రిజర్వాయర్‌ను ఫిబ్రవరి 6వ తేదీన ప్రారంభించినా ఇప్పటి వరకు అక్కడి నుంచి నీటి సరఫరా ప్రారంభించలేదన్నారు. వేసవిలో వీలైనన్ని ఎక్కువ రిజర్వాయర్‌లను నిర్మించి, ప్రారంభించాల్సిన అధికారులు ఇప్పటికే ప్రారంభించిన రిజర్వాయర్‌ను వాడుకోకపోవటం విడ్డూరమన్నారు. ఇకనైనా అధికారులు వెంటనే నీటి సరఫరాను ప్రారంభించటంతో పాటు ట్యాంకర్ ఫిల్లింగ్ పాయింట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. టౌన్‌షిప్ పరిధిలో ఖాళీగా ఉన్న ప్లాట్‌లలో చెత్తా చెదారం వేయటంతో అపరిశుభ్రంగా తయారవుతున్నాయన్నారు. టౌన్‌షిప్‌లో పలు రోడ్లలో వీధి దీపాలు వెలగటం లేదన్నారు. పార్టీ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి జి.నరేందర్, నాయకులు బి. ఉపేంద్రనాథ్‌రెడ్డి, ఎ.లక్ష్మణ్ రావు, షేక్ ఆరీఫ్, రాజేంద్రప్రసాద్, సుమ నళిని, బి.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న బీఆర్‌ఎస్ నాయకులు

జూకల్‌లో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

- అనుభవానికి తోడు శాస్త్రవేత్తల సలహాలు పాటించాలి
- సవాళ్లను అధిగమించి అభివృద్ధికి కృషి చేయాలి
- మంచి దిగుబడులు సాధించాలి
- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తదితరులు

శంషాబాద్ రూరల్: రైతులు సాగులో తమ అనుభవాలతో పాటు శాస్త్రవేత్తలు, వ్యవసాయధికారుల సూచనలు, సలహాలు పాటించి అధిక దిగుబడులు పొందాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మండల పరిధిలోని జూకల్‌లో శుక్రవారం 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే రైతులను ఉద్దేశించి మాట్లాడారు. నగరానికి సమీపంలో ఉన్నప్పటికీ రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఇంకా చాలా మంది రైతులు వ్యవసాయమే ప్రధాన జీవనాధంగా జీవనం సాగిస్తున్నారని తెలిపారు. రైతులు కష్ట పడి అధిక దిగుబడులు సాధించి, విలువైన భూములను అమ్ముకోకుండా కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంతో రైతులు సాగుపై మరింత అవగాహన పెంచుకోవాలన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు గడిచిందని.. ఇంతలోనే అంతా అయిపోయినట్లు భావించవద్దన్నారు. సవాళ్లను అధిగమించి రాష్ట్రాభివృద్ధి కోసం ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. దేశ రక్షణలో పాల్గొంటున్న సైనికులకు జాతీయ జెండా పట్టుకుని సంఘీభావం ప్రకటించారు. పాల్మాకుల సొసైటీ పరిధిలోని 70 శాతం మంది రైతులకు ఇప్పటి వరకు రుణ మాఫీ జరగలేదని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు.

ప్రతి గ్రామానికీ నాణ్యమైన విత్తనాలు...

గ్రామాల్లో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వ్యవసాయ విశ్వ విద్యాలయం పీఅండ్‌ఎం సెల్ డైరెక్టర్ డాక్టర్ టి.శశికళ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 12 వేల గ్రామాల్లో ఇద్దరు రైతుల చొప్పున 40 వేల మంది రైతులకు జూన్ 2 నుంచి విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు. రైతులు యూరియా వాడకాన్ని తగ్గించాలన్నారు. పంటలకు అవసరం మేరకు రసాయన ఎరువులు వాడాలన్నారు. ఎరువులు, విత్తనాల కొనుగోలు రషీదులను తప్పనిసరిగా తీసుకుని భద్రపర్చాలన్నారు. తక్కువ నీటితో వరి సాగు చేసుకోవచ్చన్నారు. ఆరుతడి వరి సాగుపై దృష్టి పెట్టాలన్నారు. చీడపీడల ఉధృతిని అరికట్టడానికి పంట మార్పిడి చాలా ముఖ్యమన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం చెట్లను పెంచాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరించారు.

రైతు సంక్షేమంతోనే సమాజాభివృద్ధి: డీఏఓ

రైతు సంక్షేమంతోనే సమాజాభివృద్ధి సాధ్యమని జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు అన్నారు. వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి అధిక దిగుబడులు పొందాలన్నారు. కొత్త వంగడాలు, డిమాండ్‌ను గుర్తించి ఆయా పంటల సాగును చేపట్టాలన్నారు. భూసార పరీక్షల ఆధారంగా పంటలకు ఎరువులు వాడుకోవాలన్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రీయ ఎరువులను వినియోగించాలన్నారు. కార్యక్రమంలో పాల్మాకుల సొసైటీ చైర్మన్ కె.శ్రవణ్‌కుమార్‌గౌడ్, వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, విశ్వ విద్యాలయం సి-ఎస్ఏఆర్ఈ డైరెక్టర్ డాక్టర్ కె.పి.వాణి, ఐఎస్‌హెచ్‌ఎం ప్రిన్సిపల్ సైంటిస్టు అండ్ హెడ్ డాక్టర్ ఎ.మాధవి, ఆగ్రో క్లెమైట రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపల్ సైంటిస్టు అండ్ హెడ్ డాక్టర్ పి.లీలారాణి, ఇంచార్జి ఏడీఓ కవిత, ఏఓ శ్వేత, ఏఈఓలు రాఘవేందర్‌గౌడ్, సురేష్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ తన్వీరాజు, మాజీ సర్పంచు నర్సమ్మ, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రైతులు శంకర్‌రెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛను హరిస్తే సహించం

- 'సాక్షి' ఎడిటర్ ఇంటిపై ఏపీ పోలీసుల దాడికి ఖండన
- ఏపీ పోలీసుల తీరుపై బుద్వేల్‌లో పాత్రికేయుల నిరసన



బుద్వేల్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నిరసన వ్యక్త చేస్తున్న జర్నలిస్టులు

రాజేంద్రనగర్: పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా 'సాక్షి' తెలుగు దినపత్రిక ఎడిటర్ ఆర్.ధనుంజయ రెడ్డి ఇంటిపై ఎలాంటి వారెంటు లేకుండా దాడులు చేయడాన్ని జర్నలిస్టులు ముక్తకంఠంతో ఖండించారు. శుక్రవారం సాక్షి రాజేంద్రనగర్ జోన్ ఇన్‌చార్జి బాబురావు ఆధ్వర్యంలో బుద్వేల్‌లోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజేంద్రనగర్ సర్కిల్ టీయూడబ్ల్యూజే ఐజేయూ అధ్యక్షుడు మేకల దామోదర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పత్రికా స్వేచ్ఛను కాలరాసేందుకు ఏపీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని దుయ్యబట్టారు. పత్రికలు సమాజంలో జరుగుతున్న అవినీతి అక్రమాలను వెలుగులోకి తెచ్చేందుకు అనేక కథనాలు ప్రచురిస్తాయన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ చర్యపై న్యాయ వ్యవస్థ, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్పందించాలని కోరారు. తనిఖీల పేరుతో వ్యక్తిగతంగా కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం హేయమైన చర్యగా ప్రెస్ క్లబ్ నేతలు అభివర్ణించారు. నిజాలను నిర్భయంగా ప్రజల దృష్టికి తీసుకెళ్లే స్వేచ్ఛ పత్రికలకు ఉందనే విషయాన్ని ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. తమకు వ్యతిరేకంగా వార్తలు రాస్తున్నారని దురుద్దేశంతో అక్రమ పోలీసు కేసులు నమోదు చేయించడం, వారి వ్యక్తిగత వ్యాపారాలు, ఇళ్లపై దాడులు నిర్వహించడం దురదృష్టకరమన్నారు. అనుమతి లేకుండా సామాన్య పౌరుల ఇంట్లోకి సైతం వెళ్లే అర్హత ఎవరికీ లేదనే విషయం గమనించాలన్నారు. కార్యక్రమంలో పాత్రికేయ సంఘం నేతలు అప్పారెడ్డిగూడెం భీమయ్య, ప్రేమ్‌రాజ్, వర్కల చందు, సుజీవన్ రెడ్డి, నరసింహా, శివ చరణ్, సందీప్, వినయ్, శ్రీకాంత్, గణేష్, కృష్ణ, బాబురావు, రాజేందర్ రెడ్డి, పాపిరెడ్డి, సత్యం గౌడ్, విజయ్ కుమార్, గద్ద యాదగిరి, శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యవస్థాపకత అభివృద్ధిపై శిక్షణ



నారమ్స్‌లో శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు, అధికారులు

ఏజీవర్సిటీ: విద్యార్థులు సంప్రదాయ విద్యా మార్గానికి భిన్నంగా ఆలోచించాలని... ఆ ఆలోచనలను ఆచరణలోకి తెచ్చేందుకు కృషి చేయాలని ఐసీఏఆర్ నారమ్స్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ గోపాల్ లాల్ అన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్‌లోని శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వ విద్యాలయంలో విద్యార్థులకు వ్యవస్థాపకత అభివృద్ధిపై నారమ్స్‌లో మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. శిక్షణలో గోపాల్‌లాల్‌తో పాటు ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ దండా రాజిరెడ్డి పాల్గొని మాట్లాడారు. ముఖ్యంగా పట్టణ వ్యవసాయం, స్మార్ట్ వ్యవసాయం, వెల్నెస్ ఆధారిత ఉత్పత్తులు వంటి కొత్త వాటి గురించి అన్వేషించాలని సూచించారు. ఉద్యాన రంగంలో విద్యార్థులకు స్టార్టప్ రంగంలో పెరుగుతున్న అవకాశాల గురించి వివరించారు. ముఖ్యమైన నూనెలు, పర్యావరణ అనుకూల ఎరువులు వంటి విలువ ఆధారిత ఉత్పత్తులను వ్యాపార మార్గాలుగా పరిగణించాలని విద్యార్థులకు సూచించారు. వ్యవసాయం భవిష్యత్తు శాస్త్రీయ జ్ఞానాన్ని సృజనాత్మకతతో మిళితం చేసేవి వ్యాపారంలో ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు ఉద్యోగాల గురించి ఆలోచించకుండా ఉద్యోగ ప్రదాతలుగా మారాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నారమ్స్, ఉద్యాన విశ్వ విద్యాలయం అధికారులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకే 'బడిబాట'



అత్తాపూర్‌లో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



హైదర్‌గూడలో...

అత్తాపూర్: బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని హైదర్‌గూడ మండల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మల జ్యోతి, అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత, స్వరూపారాణి అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య మరింత మెరుగుపరిచేందుకు తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ తీసుకున్న నిర్ణయంలో భాగంగా ప్రతి శుక్రవారం వేసవి సెలవుల్లో కూడా బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు వెల్లడించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అత్తాపూర్, హైదర్‌గూడ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బడి ఈడు పిల్లలు ఉన్న వారిని గుర్తించి వారి తల్లిదండ్రులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విశాలమైన తరగతి గదులు, ఉన్నత చదువులు చదివిన ఉపాధ్యాయులు, క్రీడా స్థలాలు మరెన్నో సదుపాయాలు ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ఉచిత విద్యను అందిస్తూ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్నామని స్పష్టం చేశారు. యువకులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, ప్రజాప్రతినిధులు ఆదర్శ పాఠశాలల చైర్మన్లు సహకరించాలని కోరారు.

నేడు సైనికులకు సంఘీభావ ర్యాలీ

మణికొండ: ప్రజల రక్షణకు దేశ సరిహద్దులో పాకిస్థాన్ ముష్కరులతో వీరోచితంగా పోరాడుతున్న వీర సైనికులు, వాయు, జల మార్గాలలో పోరాటం చేస్తున్న ఫైటర్‌లు, నేవీ అధికారులకు సంఘీభావంగా శనివారం సంఘీభావ ర్యాలీ నిర్వహించనున్నట్లు మణికొండ ది సిటిజన్ కౌన్సిల్ కార్యదర్శి ఉపేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. యుద్ధంతో అఖండ విజయాన్ని సాధించాలని ఆకాంక్షిస్తూ ర్యాలీని నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 6 గంటలకు అలకాపూర్ టౌన్‌షిప్ ప్రవేశం వద్ద ప్రారంభమయ్యే ర్యాలీ చింతచెట్టు సర్కిల్ నుంచి అలకాపూర్ యోగా సర్కిల్ వరకు కొనసాగుతుందన్నారు. భారత త్రివిధ దళాలకు సంఘీభావం తెలిపేందుకు మున్సిపాలిటీ పరిధిలోని అన్ని కాలనీల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మణికొండ: ఓ అపార్ట్‌మెంట్ వెనుక గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోకాపేటలో గురువారం రాత్రి వెలుగు చూసింది. పోలీసుల సమాచారం మేరకు... కోకాపేట నక్షత్ర అపార్ట్‌మెంట్ పక్కన 40 నుంచి 45 సంవత్సరాల వయసున్న వ్యక్తి మరణించాడు. పెట్రోలింగ్ పోలీసులు గమనించి అతని వివరాలను సేకరించేందుకు ప్రయత్నించినా ఎవరూ గుర్తించలేదు. కొన్ని రోజులుగా కాగితాలు సేకరిస్తూ తిరిగాడని, ఆకలి, దాహం కారణంగా మృతి చెంది ఉండవచ్చని స్థానికులు తెలిపారు. పెట్రోలింగ్ పోలీసులు సిబ్బంది జె.వాసు, అంజయ్యలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. అతని ఆచూకీ తెలిసిన వారు ఉంటే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

పోకిరీల ఆగడాలతో పరేషాన్

శాస్త్రిపురం: పోకిరీల ఆగడాలతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం వేళల్లో మీరాలం చెరువు, బార ఇమామ్, చింతల్‌మెట్, జూపార్కు వెనుక ప్రాంతంమైనా సెట్విన్ బస్తీ ప్రాంతాలకు వెళ్లాలంటే మహిళలు జంకుతున్నారు. సాయంత్రం అయ్యిందంటే చాలు ఆయా ప్రాంతాల గుండా వెళ్లేందుకు భయపడుతున్నారు. పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నా కొందరు ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట లేకుండా పోతుంది. ముఖ్యంగా మీరాలం చెరువు పక్కన పొదల్లో ఆకతాయిలు కాలక్షేపం చేస్తూ వచ్చిపోయే వారి పట్ల అసభ్యకరంగా ప్రవరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ఏమైనా అంటే దాడులకు సైతం వెనుకాడటం లేదని ఆకతాయిలను ఏమీ అనలేక మిన్నకుంటున్నామని చెబుతున్నారు. పోకిరీలు ఇక్కడి బస్‌స్టాపులు, ఫుట్‌పాత్‌లు, మిర్చి బండ్లు, చాట్‌బండ్‌లను అడ్డాలుగా చేసుకుని మహిళలను వేధింపులకు పాల్పడుతున్నారు. ఇళ్లకు చేరే దారిలో వీరు తిష్టవేస్తూ వెకిలి చేష్టలకు పాల్పడుతున్నట్లు మహిళలు వాపోతున్నారు. ఆకస్మాత్తుగా ఎదురుగా రావడం, ద్విచక్ర వాహనలను వారి దగ్గరి నుంచి తీసుకెళ్లి భయకంపితులను చేయడం, అసభ్య పదజాలాన్ని ఉపయోగించడం వంటి చర్యలతో వేధింపులకు పాల్పడుతున్నారని పలువురు మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహిళలను వేధిస్తున్న పోకిరీలను కొందరు స్థానికులు మందలిస్తే ఘర్షణలకు దిగుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. పోకిరీలు ఎంత రెచ్చిపోయినా కిమ్మనకుండా ఆ రోడ్డు గుండా రాకపోకలు సాగించాల్సిన పరిస్థితులు ఉన్నాయంటున్నారు. ఇకనైనా పోలీసులు చర్యలు తీసుకొని పోకిరీల ఆట కట్టించాలని కోరుతున్నారు.

సరస్వతి మాత విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహదాతను సన్మానిస్తున్న అధికారులు

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని నాలెడ్జ్ మేనేజ్మెంట్ సెంటర్‌లో శుక్రవారం చదువుల తల్లి సరస్వతి మాత విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ విగ్రహాన్ని విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహించి రిటైరైన ప్రొఫెసర్ రాచాబత్తుల శ్రీహరిబాబు సహకారంతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీహరిబాబు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారిని విశ్వవిద్యాలయం అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ విద్యాసాగర్, లైబ్రేరియన్ రవికుమార్, విశ్వవిద్యాలయం అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉన్నా.. లేనట్టే!

- అలంకారప్రాయంగా ఓపెన్ జిమ్ సామగ్రి
- పెద్ద తాళ్లకుంట పార్కులో శిథిలమైన వస్తువులు
- మరమ్మతుల విషయంలో అధికారుల నిర్లక్ష్యం
- నిరాశతో వెనుదిరుగుతున్న యువత



పెద్దతాళ్లకుంట పార్కు ముఖద్వారం



పెద్దతాళ్లకుంట పార్కులో నిరుపయోగంగా ఉన్న జిమ్ సామగ్రి

అత్తాపూర్: పార్కుల్లో ఆహ్లాదంతోపాటు ప్రజల ఆరోగ్య సంరక్షణకు ఏర్పాటు చేసిన ఓపన్ జిమ్‌లలో సామగ్రి తుప్పుపట్టి శిథిలావస్థకు చేరుకుంది. రూ. లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆ సామగ్రి అలంకారప్రాయంగా మారడంతో యువత నిరాశకు లోనవుతోంది. సీనియర్ సిటిజన్లు కూడా ఒకింత నిరుత్సాహానికి గురవుతున్నారు.

– అత్తాపూర్ డివిజన్ పెద్దతాళ్లకుంట పార్కులో ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేసేందుకు జీహెచ్ఎంసీ నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా అప్పటి నగర మేయర్ బొంతు రామ్మోహన్ పెద్దతాళ్లకుంట పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయించారు. అప్పటి నుంచి ఆ ఓపన్ జిమ్‌లోని క్రీడా సామగ్రిని స్థానికులు ఉదయం, సాయంత్రం వేళల్లో ఉపయోగించుకున్నారు. ప్రస్తుతం పార్కులో ఏర్పాటు చేసిన క్రీడా సామగ్రి శిథిలావస్థకు చేరుకుంది. సంవత్సరాలుగా వ్యాయామానికి అలవాటు పడ్డ పరిసర ప్రాంతాల యువకులు, రిటైర్డ్ ఉద్యోగులు, సీనియర్ సిటిజన్‌లు నిత్యం పార్కుకు వస్తూ వెళ్తున్నారు. అయితే ఆ పరికరాలు శిథిలావస్థకు చేరి ఉపయోగంలో లేనందున నిరాశగా వెనుదిరుగుతున్నారు.

ప్రైవేటు జిమ్‌లకు వెళ్లలేం

వేసవి సెలవుల నేపథ్యంలో స్నేహితులతో కలిసి పెద్దతాళ్లకుంట ఓపెన్ జిమ్‌కు వస్తున్నాం. జిమ్‌లో ఆట వస్తువులు, ఇతర క్రీడా సామగ్రి శిథిలమై ఉపయోగంలో లేనందున చేసేదిలేక సరదాగా కాలక్షేపం చేస్తూ ఇళ్లకు వెళ్తున్నాం. ప్రైవేటు జిమ్‌లకు వెళ్లాలంటే ఖర్చు భరించలేకపోతున్నాం. స్థానికంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లోనే పరికరాలను బాగు చేయించాలి.

– శశాంత్‌రెడ్డి, హేమంత్, సుధీర్, హైదర్‌గూడ

కొత్తవి ఏర్పాటు చేయాలి



కొన్నేళ్లుగా పెద్ద తాళ్లకుంట ఓపెన్ జిమ్‌కు ఉభయ సంధ్య వేళల్లో వచ్చి సైక్లింగ్ చేసేవాడిని. అయితే జిమ్ పరికరాలు ఉపయోగలో లేనందున పార్కు వచ్చిన యువకులతో పిచ్చాపాటి మాట్లాడాల్సి వస్తోంది. పాడైన పరికరాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలి. రిటైర్డ్ ఉద్యోగులు, వయోవృద్ధులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి.

– వరద రాజు, ఎన్ఎండీసీ రిటైర్డ్ ఉద్యోగి, హైదర్‌గూడ

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మణికొండ: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా శనివారం పలు కాలనీలలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు మణికొండ ఏఈ సంతోష్‌కుమార్ తెలిపారు. ఉదయం 9.30 నుంచి 10 గంటల వరకు కేపీఆర్ కాలనీ, మణికొండ గార్డన్, సుందర్‌గార్డన్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంతం, పోచమ్మ కాలనీ, అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నెంబర్ 3 నుంచి 13 వరకు విద్యుత్ ఉండదన్నారు. ఉదయం 10 నుంచి 10.30 గంటల వరకు లక్ష్మీనగర్, సత్యమ్మ గార్డన్, మర్రిచెట్టు సర్కిల్ ప్రాంతాలు, ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు భాగ్యలక్ష్మికాలనీ, హుడా కాలనీ, ఫ్రెండ్స్ కాలనీ, తులిప్‌గార్డన్, సెక్రటేరియట్ కాలనీ, లాలమ్మ గార్డన్, బతుకమ్మ పార్క్ ప్రాంతాలలో సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నెంబర్ 13 నుంచి 25 వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అలకాపూర్ సెక్టార్ 2ఎ, అలకాపూర్ సెక్టార్ బి, సెక్టార్ సి, సెక్టార్ డి, సెక్రటేరియట్ కాలనీ, ఆదిత్యఫోర్ట్ విల్లాస్ ప్రాంతాలు, సాయంత్రం 3.30 నుంచి 4 గంటల వరకు క్రిన్స్ విల్లాస్, నెమలినగర్, సాయంత్రం 4 నుంచి 4.30 గంటల వరకు అలకాపూర్ రోడ్డు నెంబర్ 1,2, సెక్టార్‌లు ఏ,బీ,సీ, శివాలయం ప్రాంతాలలో ఉండదని ఏఈ వివరించారు.



నార్సింగి ఏఈ పరిధిలో...

ఉదయం 9 నుంచి 9.30 గంటల వరకు ఖానాపూర్ గ్రామం, ఓఆర్ఆర్ సర్వీసు రోడ్డు, ఉదయం 9.30 నుంచి 10 గంటల వరకు బృందావన్ కాలనీ, ఉదయం 10 నుంచి 10.30 గంటల వరకు గండిపేట, శ్రీనగర్, గ్రే హోమ్స్, ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు వీరభద్రస్వామి దేవాలయం, గ్రే హోమ్స్, ఈఐపీఎల్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని ఏఈ మణికంఠ తెలిపారు. సాయంత్రం 4 నుంచి 4.30 గంటల వరకు మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఫెయిర్‌ఫీల్డ్ కాలనీ, ఈవీవీ కాలనీ, పోయనీర్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, సాయంత్రం 4.30 నుంచి 5 గంటల వరకు గిరిగిరి గడ్డ, నార్సింగి గ్రామం, ముప్పా విల్లాస్, ముప్పా అలేఖ్య ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని ఏఈ వివరించారు.

పహాడీ ఫీడర్ పరిధిలో...

రాజేంద్రనగర్: పహాడీ విద్యుత్ ఫీడర్ పరిధిలోని సులేమాన్‌నగర్, చింతల్‌మేట్, పహాడీ ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు విద్యుత్ ఉండదని అధికారులు తెలిపారు.

శంషాబాద్ పరిధిలో...

శంషాబాద్: పట్టణంలోని రాళ్లగూడ, ఓంజైభవాని ఫీడర్ పరిధిలోని ఆయా బస్తీల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ బాషా తెలిపారు. రాళ్లగూడ నెక్సా షోరూం, ఓఆర్ఆర్ సర్వీసురోడ్డు, సిద్దులగుట్ట కమాన్, సీఎస్‌కే, సామ ఎన్‌క్లేవ్, మసీదుగడ్డ, చౌదర్‌గూడ, తొండుపల్లి, ఊట్‌పల్లి, రాయల్‌విల్లా, బృందావన్ కాలనీల్లో కరెంటు సరఫరా ఉండదన్నారు.

మైలార్‌దేవ్‌పల్లి సబ్‌స్టేషన్ పరిధిలో...

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో ఉండదని అధికారులు తెలిపారు. బండ్లగూడ ఫీడర్, పల్లెచెరువు ఫీడర్‌లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 వరకు ఆయూషా కాలనీ, ఆలీనగర్, అహ్మద్‌నగర్, కింగ్స్ అవెన్యూ, యూసుఫ్ గుల్షన్ కాలనీ, క్రిస్టల్ టౌన్, రహమత్ కాలనీలో విద్యుత్ ఉండదన్నారు. సాయిబాబానగర్ ఫీడర్‌లో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, మైలార్‌దేవ్‌పల్లి ఫీడర్‌లో ఉదయం 11 నుంచి 11.30 వరకు మైలార్‌దేవ్‌పల్లి గ్రామం, ప్రగతి కాలనీ, బృందావన్ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు.